సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 26-12-2024

సంపుటి: 20 సంచిక: 232

పేజీలు: 4 వెల: రూ.1



## షిరిడీసాయిబాబా కేలెండర్ ఆవిష్కరణ

**(సత్యంన్యూస్, పలాస)**

ప్రముఖ వైద్యులు డాక్టర్ మంజుల నటరాజ్ చేతుల మీదుగా షిరిడీ సాయిబాబా కేరెండర్ ఆవిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా బాబా మందిర నిర్వాహకుడు దువ్వాడ శ్రీధర్(బాబా) మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ప్రతీ సాయి భక్తునికి బాబా కేలెండర్ అందజేసేలా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లా కామేశ్వరరావు, తాళాస్ ప్రదీప్, బెళ్ళాల నారాయణరావు, డబ్బీరు భువనేశ్వరరావు, బోనెల రమణ, కూన హేమాచలం, కిల్లి ఆనంద్, బొంపల్లి అప్పారావు, ధనరాజ్, మూల దయాకర్, కింతలి బాబూరావు, సాహుకారి నాగేశ్వరావు, మార్పు శ్యామ్, తిరునగరి శ్రీనివాస్, బారాటం సత్యం, కొర్ల శ్రీనివాస్, వాకాలపురి శ్రీనివాస్, డాక్టర్ క్రిష్ణ, వాకాడ బుచ్చయ్య, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఏడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# గోకులంలో గుంటనక్కలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు పక్కదారి
- కోళ్ల పెంపకం, గొర్రెలు, అజోలా కిట్ పంపిణీ చేయకుండానే రికార్డుల్లో నమోదు
- 2023 చివరి వరకు ఉన్న అధికారుల వ్యవహారంపై ఫిర్యాదు
- పశుమత్స్యదర్శిని పుస్తకం పేరిట వసూళ్లు

## రాజుకుంటున్న పశు సంవర్ధక శాఖ కుంభకోణం

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

జిల్లా పశుసంవర్ధక శాఖలో ఒక పద్ధతి ప్రకారం గత పదేళ్లుగా ఆర్థిక అక్రమాలు చోటుచేసుకున్నాయి. వీటిని అప్పటి ప్రజాప్రతినిధులు కమీషన్లకు కక్కుర్తి పడడంతో జిల్లా శాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడ్డారు. అజోలా కిట్స్, చూలు పశువులు, గొర్రెల పంపిణీ, పెరటి కోళ్ల పెంపకం,



24 MAY 2024

Cy. R.P

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పశుసంవర్ధక శాఖ

003744

నుండి
శ్రీమతి టి సౌజన్య,
పౌర సమాచార అధికారి,
అదనపు సంచాలకులు వారి కార్యాలయము,
పశుసంవర్ధక శాఖ, SMILE, విశాఖపట్నం.

వరకు
శ్రీమతి Ch. రాజేశ్వరి,
జిల్లా SC/ST మహిళా కన్వీనర్,
శాంతి నగర్ కోలని,
ARTS కాలేజీ దగ్గర,
శ్రీకాకుళం జిల్లా.

లేఖ.ఆర్.ఓ.సి.సంఖ్య.33 /బి/2024, తేదీ: 20.05.2024.

అయ్యా,

విషయము : సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం శ్రీమతి Ch. రాజేశ్వరి , జిల్లా SC/ST మహిళా కన్వీనర్, శ్రీకాకుళం జిల్లా వారు అడిగిన సమాచారం – ఇచ్చుట - గురించి.

సూచన : మీ దరఖాస్తు శ్రీ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, విజయవాడ వారి మెమో. ఆర్.సి.నెం. AHF02 – OPES/517/2024-EST ( B-IV) -DAH తేది: 07.05.2024

***

సమాచార హక్కు చట్టం - 2005 ప్రకారము, మీరు అడిగిన సమాచారమును ఈ క్రింది విధముగా పంపడమైనది.

04. పశు మత్స్య దర్శిని పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా వసూలు చేసిన నిధులు వివరాలు మరియు ఖర్చు చేసిన వివరాలు , వాటికి సంబంధించిన బిల్లులు జెరాక్స్ కాపీలు మరియు బ్యాంకు స్టేట్ మెంట్ కాపీలు సమాచార హక్కు చట్టం ప్రకారం CD రూపం లో తెలియజేయగలరు.

జ : పశు మత్స్య దర్శిని పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు వసూలు చేసిన నిధులు మరియు ఖర్చుల వివరాలు ఈ క్రింది విధముగా కలవు.


| | | |
|---|---|---|
| 01. సంచాలకులు , పశు సంవర్ధక శాఖ,విజయవాడ వారి ద్వారావిడుదల కాబడిన నిధులు (కార్పస్ ఫండ్ ) | - | రూ. 15,00,000 = 00 |
| 02. Advertisement కొరకు 2021 – 2022 నందు మంజూరు చేసిన నిధులు | - | రూ. 16,50,000 = 00 |
| 03. చందాదారుల నుండి వసూలు చేయబడిన నిధులు (ఇప్పటివరకు) | - | రూ. 4,65,68,000 = 00 |
| మంజూరు కాబడిన మొత్తం నిధులు | - | రూ. 4,95,58,500 = 00 |
| 04. ఈ రోజు వరకు జరిగిన ఖర్చులు (మ్యాగజైను డిజైనింగు , ఎడిటింగ్, ప్రింటింగ్, మరియు పోస్టల్ ఛార్జీలు) | - | రూ. 2,87,68,196 = 00 |
| 05. బ్యాంకులో ఫిక్స్డ్ డిపాజిట్స్ చేయబడిన సొమ్ము | - | రూ. 1,40,00,000 = 00 |
| 06. బ్యాంకు బాలన్స్ సొమ్ము (సేవింగ్స్ అకౌంట్ నందు తేది. 20/05/2024 నాటికి) | - | రూ. 69,49,804 = 00 |

// పేజీ త్రిప్పుము //

పాతపట్నంలో తలసరి ఆదాయం పెంచడం కోసం పశుసంవర్ధక శాఖ ద్వారా ఆవులు, గొర్రెలు, మేకల యూనిట్లు కొనుగోలు, గోకులం పేరుతో పశువుల షెడ్లు, పశుగ్రాసం పెంపకం, విత్తనాలు, మందుల పంపిణీ, పశుగ్రాసం పంపిణీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చిన నిధులను పక్కదారి పట్టించారు. దీనిపై 2023 డిసెంబర్ 12న జిల్లాలోని పలువురు పశు సంవర్ధక శాఖ అధికారులు పేర్లను ప్రస్తావిస్తూ లోకాయుక్తకు దళిత సంఘాల ప్రతినిధి సిహెచ్ రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త కేసు నమోదు చేసింది. ఈ వివాదం ప్రస్తుతం నడుస్తుంది. దీనికి కొనసాగింపుగా గ్రామాల్లో సచివాలయం వ్యవస్థ సేవలు ప్రారంభమైన తర్వాత పశుమత్స్యదర్శని మ్యూగజైన్ పేరుతో రూ.5కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్టు వెలుగులోకి వచ్చింది. ఇది ఉద్దేశ పూర్వకంగా పశుసంవర్ధక శాఖ అధికారులు, గత ప్రభుత్వంలో ఆ శాఖ మంత్రి పేషీతో కలిసి ఈ దందాను రాష్ట్ర వ్యాప్తంగా సాగించినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్, అదనపు డైరెక్టర్, జేడీ, డీడీ శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, పొందూరు, ఆమదాలవలస, పాతపట్నం, నందిగాం ఏడీలు చందాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీ, డీజీ ఏసీబీ విజయవాడకి ఎచ్చెర్ల నుంచి ఒక ఫిర్యాదు అందింది.

### మాసపత్రిక పేరుతో చందాలు

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న యానిమల్ హజ్బెంగ్రీ అసిస్టెంట్ (ఏహెచ్ఏ)కు పశుమత్స్యదర్శిని సుచిత్ర మాసపత్రిక పుస్తకానికి చందాలు వసూలు చేయాలని టార్గెట్ పెట్టారు. పశుసంవర్ధక శాఖలో ఎటువంటి సమాచారమైనా రైతులకు వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా అందజేయవచ్చు. అధికారులు కావాలనే ఒక పథకం ప్రకారం పశుమత్స్యదర్శిని పేరుతో ఒక మాస పత్రికను తీసుకువచ్చారు. పాడి పశువులు, మత్స్య సంపదకు సంబంధించిన సమాచారం రైతులకు అందించాలని అనుకుంటే ప్రభుత్వం ఈ మాస పత్రికను ప్రభుత్వం ఉచితంగా రైతులకు అందించవచ్చు. అయితే దీని ధరను రూ.20గా నిర్ధారించి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారు. ఒక సచివాలయం పరిధిలో ఉన్న ఏహెచ్ఏకు ప్రతి నెల ఆరు పుస్తకాలు టార్గెట్ ఇచ్చి ఒక రైతు నుంచి రెండేళ్ల చందా (పోస్టల్ ఛార్జీలతో కలుపుకొని) రూ.500 వసూలు చేయాలని హుకుం జారీచేశారు. రెండేళ్లు చందాలు ఇవ్వని రైతులపై ఒత్తిడి పెంచి ఏహెచ్ఏలతో చందాలు వసూలు చేయించారు. మాసపత్రికకు చందా ఇవ్వని రైతుల పశువులకు వైద్యం అందించకుండా పశువైద్య అధికారులు ఉద్దేశపూర్వకంగా వ్యవహరించారు. రెండేళ్ల చందా చెల్లించని రైతులకు గ్రామాల్లో ఏహెచ్ఏ సేవలను అందించవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రైతుల నుంచి చందాలు రాబట్టకపోతే ఏహెచ్ఏ జీతాల్లో కోత పెడతామని హెచ్చరించి మరీ వసూలుచేశారు. టార్గెట్ రీచ్ కాని ఏహెచ్ఏలకు వేతనాలు నిలిపేస్తామని చెప్పి టార్గెట్ ప్రకారం ఒక్కొక్కరి నుంచి ఆరు పుస్తకాలకు రెండేళ్ల చందాగా రూ.3వేలు వసూలు చేశారు.



To
The Deputy Superintendent of Police
Anti corruption Bureau
Srikakulam

Respected sir

నేను గతంలో పశుసంవర్ధక శాఖలో పశుమత్స్యదర్శిని Magazine పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్ళు పై ఫిర్యాదు చేసియున్నాను. ప్రతి గ్రామ సచివాలయంలో పనిచేయుచున్న Animal Husbandry Assistants (AHA) లకు పశు సంవర్ధక శాఖా అధికారులైన Dr Y SIMHACHALAM, Special officer, Animal Husbandry Department, Srikakulam , Rtd joint Director Dr M Kishore, మరియు Dr M Jagannadham, Deputy Director Srikakulam, Dr K Rajagopal, AD , Narasannapeta, Dr PSG Balakrishna, AD, Ponduru, Dr R AnandaRao , AD , Amadalavalasa, Dr M Karunakar Rao , AD , Pathapatnam , Dr N Chandrasekhar AD , Palasa , Dr M Ravikrishna AD , Nandigam , Dr G RajaSekhar AD , Gara లు కలసి Director అయిన Dr AmarendhraKumar సహకారంతో రైతుల నుండి ఒక్కొక్కరి వద్ద నుండి పశు మత్స్యదర్శిని పేరుతో రూ॥ 500/- చెప్పున బలవంతంగా వసూలు చేసారు. డబ్బు చెల్లించని రైతులకు వైద్యం చేయకుండా ఇబ్బందికి గురిచేసారు . అసలు పశుసంవర్ధక శాఖలో ఎటువంటి సమాచారం రైతులకు అందించాలన్న Website ద్వారా ఉచితంగా అందజేయవచ్చు . కాని కావాలనే ఒక పధకం ప్రకారం పశు సంవర్ధక శాఖ సిబ్బంది మరియు గ్రామ సచివాలయం లలో పనిచేయుచున్న AHA లకు ఒక్కొక్కరికి 6 magazine లను target ఇచ్చి నెలకు ఒక్కొక్కరి నుండి 3000/- రూపాయిలు బలవంతంగా వసూలు చేసారు . వసూలు చేసిన సొమ్మును ఎందుకు ఖర్చు చేసారని బ్యాంకు statement అందించాలని సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారమివ్వాలని కోరగా ఇచ్చిన Bank Statement పరిశీలించగా సుమారు 5 కోట్లు రూపాయిలు వసూలు చేసి. వసూలు చేసిన సొమ్మును Additional Director పేరుతో IDBI Bank , Visakhapatnam branch లో జమ చేసి వివిధ printing press ల పేరుతో మరియు వివిధ పేర్లతో 3నెలలలోపే బారీగా Withdrawal చేసి వారితో కుమ్మక్కై డబ్బును పంచుకొని అవినీతికి పాల్పడ్డారు. చెల్లింపులు చేసిన printing press లు raw materials ఎక్కడ కొన్నారు? ఎంత raw Meterial కొన్నారు? ఎంత GST చెల్లించారు? , ఎన్ని Magazine ను సప్లై చేసారు? అ printing press ల యొక్క Audit report లను పరిశీలిస్తే అసలు విషయాలు బయటపడతాయి .నిధులు దుర్వినియోగం కు పాల్పడినట్లుగా ఆధారాలు కన్పిస్తున్నాయి కావట్టి తమరు లోతైన దర్యాప్తు జరిపి అమాయక రైతులనుండి పశుమత్స్యదర్శిని Magazine పేరుతో అధిక మొత్తం లో వసూలు చేసి ఎటువంటి Magazine లను అందజేయకుండా మోసం చేసి నిధులు దుర్వినియోగం చేసిన దోషులపై కఠిన చర్యలు తీసికోవాలని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
తమ విధేయుడు
Seepana Ramana

Copy to The DG, ACB Vijayawada.




### రూ. 4.65 కోట్లు వసూలు


తీరా చందాలు చెల్లించినా మాస పత్రికలను అందించకుండా తాత్సారం చేశారు. ముద్రించిన కొన్నింటిని మాత్రం జిల్లా జేడీ, డీడీ కార్యాలయాలకు తీసుకువచ్చి మమ అనిపించారు. పశుమత్స్యదర్శిని మాసపత్రిక పేరుతో శాఖ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు అనుమానం వచ్చిన ఏహెచ్ఏలు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఏసీబీ అధికారులు ఎచ్చెర్ల సచివాలయాలు పరిధిలో ఏహెచ్ఏల వాంగ్మూలం నమోదు చేసినట్టు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో టార్గెట్ ఇచ్చినవారి వివరాలు, వసూలుచేసిన మొత్తంపై పూర్తి సమాచారం సేకరించినట్టు తెలిసింది. అధికారుల ఆదేశాలతో బలవంతపు వసూళ్లు చేసి ఐడీబీఐ బ్యాంకులో జమ చేసిన మొత్తాన్ని దేనికోసం ఖర్చు చేశారని సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి వివరాలు ఇవ్వాలని ఈ ఏడాది మే 20న విశాఖపట్నం అదనపు సంచాలకుల - మిగతా 4లో



• గెస్ట్ ఎడిటోరియల్

# మౌలిక సదుపాయాలు మెరుగుపడితే..

'గేమ్ అమ్మాయిలది కాదు, అబ్బాయిలదీ కాదు. స్టామి నాది..' అని ఓ యాడ్‌లో అన్నట్టు సాధించాలనే పట్టుదల ఉండాలే కానీ ఆటకు లింగభేదం లేదు. ఇదే మన క్రీడాకారిణిలు మరోసారి రుజువు చేశారు. తాజాగా తొలి మహిళల అండర్-19 ఆసియాకప్ క్రికెట్ టోర్నీలో మన అమ్మాయిలు అదరగొట్టి టైటిల్ సాధించారు. దేశం గర్వించేలా చేశారు. ఫైనల్లో 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించారు. 'అమ్మాయిలు సత్తా చాటేనా' అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ మన మహిళా క్రికెట్ టీమ్ రికార్డులు బద్దలు కొట్టింది. ఈ టీంలో తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం మనకు మరింత గర్వకారణం. ఒక్క క్రికెట్‌లోనే కాదు అన్ని రకాల క్రీడల్లోనూ మన అమ్మాయిలు ఎప్పటికప్పుడు ఇండియా పరువు నిలబెడుతూనే ఉన్నారు. అంతర్జాతీయ పోటీల్లో దేశం పెట్టుకుంటున్న ఆశల భారాన్ని మహిళా క్రీడాకారులు మోస్తూనే ఉన్నారు. క్రికెట్, దానికి మించి రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్‌తో, బాక్సింగ్‌తో పాటు షూటింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, ట్రాక్ అండ్ ఫీల్డ్.. ఇలా ఏ విభాగంలో చూసినా ప్రస్తుతం పురుషులతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువ మంది క్రీడాకారిణులు ఉన్నారు. గతంలో జరిగిన రియో ఒలింపిక్స్‌లో, టోక్యో ఒలింపిక్స్‌తో పాటు అనేక పోటీల్లో తమ శక్తిమేరకు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఇలా ఎన్ని పతకాలు సాధించినా మన పురుషాధిక్య సమాజంలో క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలంటే అమ్మాయిలకు ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. సంస్కృతి, సంప్రదాయం పేరిట అవరోధాలు సృష్టిస్తూనే ఉన్నారు. దేశానికి పతకాల వర్షం కురిపిస్తున్న రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్ వంటి నేరస్తులను కాపాడుకునేందుకు తీవ్రంగా కృషి చేసిన చరిత్ర మన కాషాయ పాలకుది. ఇలాంటి ఎన్నో అడ్డంకులను ఎదిరించి అమ్మాయిలు కొందరు క్రీడా ప్రపంచంలోకి అడుగు పెట్టినా, సరైన సదుపాయాలు ఉండటం లేదు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయినా పురుషుల కంటే తామేమీ తక్కువ కాదంటున్నారు మన క్రీడాకారిణులు. రెండు దశాబ్దాల ఫలితాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది. ఇరవయ్యేళ్ల కిందట సిడ్నీ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌కు భారత్ 72 మంది క్రీడాకారులను పంపింది. అప్పుడే కరణం మల్లేశ్వరికి వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం వచ్చింది. ఆ ఒలింపిక్స్‌లో భారత్ సాధించింది ఆ ఒక్క పతకమే. ఇక రియో వేదికగా జరిగిన ఒలింపిక్స్‌కు 15 విభాగాలకు చెందిన 117 మంది క్రీడాకారులు వెళ్లారు. అందులో 54 మంది మహిళలు ఉన్నారు. అప్పుడు కూడా రెండు పతకాలు మాత్రమే వచ్చాయి. అవీ మహిళలు సాధించినవే. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు రజతం, రెజ్లింగ్‌లో సాక్షి మాలిక్ కాంస్యం. అప్పటి నుంచి నేటి 'ఖేలో ఇండియా' వరకు మహిళలు వివిధ క్రీడల్లో, అనేక విభాగాల్లో పతకాలు సాధిస్తూనే ఉన్నారు. ఇక నిరుపేద కుటుంబంలో పుట్టిన మేరికోమ్ పక్కింటి వారు పెట్టిన మాంసం తిని బాక్సింగ్‌లో రాణించి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టింది. లింగ సమానత్వం అత్యంత తక్కువగా ఉన్న హర్యానా లాంటి రాష్ట్రాల నుంచి కూడా కొందరు ప్రముఖ మహిళా క్రీడాకారిణులు దేశానికి వన్నె తెస్తున్నారు. వారిలో గీతా ఫోగట్, బబితా ఫోగట్, వినేష్‌లు రెజ్లింగ్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించారు. ఇటీవల ముంబయి, హైదరాబాద్ వంటి నగరాల నుంచి అనేక మంది మహిళా క్రీడాకారిణులు వెలుగులోకి వచ్చారు. పాఠశాల, జిల్లా స్థాయిలో పోటీలకు దిగుతున్నారు. అవకాశం వస్తే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొంటున్నారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఆర్థిక భారం అమ్మాయిలను వెంటాడుతోంది. క్రీడారంగానికి ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ కూడా నామమాత్రంగానే ఉంటోంది. ప్రభుత్వాలు కూడా పతకాలు సాధించిన క్రీడాకారులకే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. నైపుణ్యం ఉన్నవారిని ముందే గుర్తించి, తగిన శిక్షణ ఇవ్వడంలో మన ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయనేది అందరూ అంగీకరించే వాస్తవం. దీనివల్ల పేద, గ్రామీణ క్రీడాకారిణులు నైపుణ్యం ఉన్నప్పటికీ కింది స్థాయిలోనే ఆగిపోతున్నారు. ఇక పూర్తిగా భద్రత కరువైన నేటి సమాజంలో ఆడపిల్లలను బయటకు పంపించాలంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. క్రీడల్లో అమ్మాయిల వెనకబాటుకు ఇది కూడా ఓ కారణం. అలాగే మెరుగైన శిక్షణ, పోషకాహారం వంటి కారణాలతో ఇప్పటికీ దేశంలో క్రీడలు పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. కొన్ని చిన్న గ్రామాల్లో అయితే ఆటలపై అవగాహన ఉండడం లేదు. ఇక పోటీల గురించి ఎలా తెలుస్తుంది? కనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాల స్థాయి నుండే అమ్మాయిలను క్రీడల్లో ప్రోత్సహించాల్సిన బాధ్యత తమదే అని ప్రభుత్వాలు గుర్తించాలి. ముఖ్యంగా గ్రామస్థాయిలో క్రీడలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడితే క్రీడాకారిణులు మరింత మంది ముందుకొచ్చే అవకాశం ఉంటుంది.



నూతనంగా నియమింపబడిన, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ కమిటీ, మెంబర్ టి.ధనుంజయరావు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను, ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వాలంటరీ ఆర్గనైజేషన్‌లో సేవలు అందించడంతోపాటు, సుదీర్ఘకాలంపాటు జర్నలిస్టుగా, న్యాయవాదిగా పనిచేసిన తనకు ప్రభుత్వం, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీలో స్థానం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. **– సత్యంన్యూస్, ఆమదాలవలస**

## పేదల పక్షాన నిలిచేది సీపీఐ

(సత్యంన్యూస్, పలాస)

భారత కమ్యూనిస్టు పార్టీ కాశీబుగ్గ మెయిన్ రోడ్ శాఖ కార్యదర్శి సుందర్రావు జెండాను ఆవిష్కరించారు. సీపీఐ వంద సంవత్సరాల వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజక కార్యదర్శి చాపర వేణు మాట్లాడుతూ. కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26, 1925 సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ప్రారంభించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్బంధంలో పుట్టి పెరిగిన పార్టీ అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం రావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. దేశవ్యాప్తంగా కష్టజీవులు, శ్రమజీవులు తరపున నిలబడినటువంటి పార్టీ అని తెలిపారు భూపోరాటాల ద్వారా పేదలకు భూ పంపిణీ చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వలేకపోయారని గత ఎన్నికల్లో టీడీపీ పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. ఇంటి నిర్మాణానికి గాను రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరెంటు చార్జీలు రూ.15,484కోట్ల భారం ప్రజలపై వేస్తోందన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకునేంత వరకు కమ్యూనిస్టు పార్టీ తరుపున పోరాటం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రజలపై భారం పడకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్‌చార్జీలు తగ్గించేంతవరకు నిరసన కార్యక్రమాలలో మేధావులు, కార్మిక, రైతులు, వ్యాపార వాణిజ్య వ్యాపారస్తులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి, సిపిఐ నాయకులు ముకుందరావు, మున్నా, స్వామి, చిన్న, గుణ శేఖర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు



## ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ బహుకరణ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాదిరెడ్డి విజయప్రసాద్ సేవలు అమూల్యమని, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు, సెక్రటరీ బలివాడ మల్లేశ్వర రావులు గురువారం అన్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల మండలం, భగీరథపురం గ్రామానికి చెందిన నిరుపేద కోరాడ మోహన రావు ప్రతీ సోమవారం జరిగే మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఎలెక్టికల్ ట్రై సైకిల్ కోసం అభ్యర్థించగా, అనివార్యకారణాల వలన కార్యరూపం దాల్చలేదు. అక్కడే వికలాంగుల సహాయార్థం సోమవారం విధులు నిర్వర్తిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ గమనించగా, ఆంధ్ర సీమేన్‌గా విధులు నిర్వర్తిస్తూ స్థానిక కత్తెర వీధికి చెందిన బాదిరెడ్డి అప్పారావు, నాగమణిల కుమారుడు విజయప్రసాద్ ముందుకువచ్చి అందించిన సహకారంతో సుమారు రూ.30వేల విలువగల ఎలక్ట్రిక్ ట్రై సైకిల్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్ రావు చేతుల మీదుగా బాధితునికి అందించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు, సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావులు మాట్లాడుతూ ఆపదలో ఉండేవారిని ఆదుకోవటం ప్రతీ ఒక్కరి కర్తవ్యమని, బాదిరెడ్డి విజయప్రసాద్ అందించిన సహకారం మరువలేనిదని, ఒక సీమేన్‌గా విధుల్లో ఉంటూ సేవా రూపంలో ముందుకు రావటం హర్షణీయమన్నారు. అలాగే రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ చొరవ అనివార్యమన్నారు. ఈ కార్యక్రమంలో బాధితుడు కోరాడ మోహనరావు, రెడ్‌క్రాస్ సభ్యులు, పెద్దపాడు సేవకులు బొట్టా సాయికుమార్, పొడుగు చరణ్, ఉర్లం శివతేజ, తదితరులు పాల్గొన్నారు.

## విలీన సభను విజయవంతం చేయండి

(సత్యంన్యూస్, పలాస)

ఈనెల 28న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో నిర్వహించిన రెండు విప్లవపార్టీల విలీనం సభ గోడపత్రికలను, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రకాష్ మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యత, రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ ఈనెల 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ ఖట్కర్ హాజరవుతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంగా పచ్చి కార్పోరేట్ దోపిడీ విధానాలను అవలంభిస్తూ దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించేవారిని అణిచివేయడం నిత్యకృత్యంగా జరుగుతుందన్నారు. ఇలాంటి కష్టకాలంలో దేశంలో ఉన్న విప్లవకారులంతా ఐక్యమై ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు. నక్సల్‌బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో ఏర్పడిన న్యూడెమోక్రసీ పార్టీకి ప్రజల తరపున పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. అనేకమంది వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కాంక్షించారన్నారు. అమరవీరుల ఆశయ సాధనకు రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఐక్యమవుతున్నాయన్నారు. భవిష్యత్తులో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకెయంయస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పీవైయల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, ఏఐకెయంయస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు, జి.కామేశ్వరరావు, జె.అప్పయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.



























# బెస్ట్ సాంగ్స్ ఆఫ్ ది 2024

సంవత్సరం చివరకు వచ్చేశాం. మరో ఐదు రోజుల్లో మనం కొత్త ఏడా దిలోకి అడుగు పెట్టబోతున్నాం. గడిచిన ఏడాది కాలంలో సంగీత ప్రియు లను అలరించిన తెలుగు సినిమా పాటలు చాలానే ఉన్నాయి. కొన్ని సాంగ్స్ సినిమా రిలీజ్ అవ్వకముందే ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టు కుంటే, మరికొన్ని పాటలు మాత్రం సినిమా విడుదలైన తర్వాత జనాల్లోకి బాగా వెళ్లాయి. సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో వైరల్ అయిన డ్యూయెట్స్ కొన్నుంటే, నెట్టింట దుమ్ము రేపిన డ్యాన్స్ నంబర్స్ ఇంకొన్ని ఉన్నాయి. ఓవరాల్‌గా బెస్ట్ సాంగ్స్ ఆఫ్ ది ఇయర్ ఏవో ఇప్పుడు చూద్దాం.

"గుంటూరు కారం" సినిమాలోని చార్ట్‌బస్టర్ సాంగ్స్‌తో ఈ ఏడాది మ్యూజికల్ సెలబ్రేషన్స్ స్టార్ట్ అయ్యాయి. థమన్ స్వరపరిచిన 'దమ్ మసాలా బిర్యానీ', 'కుర్చీ మడతపెట్టి', 'మావా ఎంతైనా' పాటలు శ్రోతలను విపరీతంగా అలరించాయి. థియేటర్లతో పాటుగా సోషల్ మీడియాని షేక్ చేశాయి. పార్టీలలో, పెళ్లిళ్లలో, కాలేజ్ ఈవెంట్స్, ఊరేగింపులలో ఎక్కడ చూసినా ఈ పాటలే వినిపించాయి. ఇందులో మహేష్‌బాబు గతంలో ఎన్నడూ లేని విధంగా స్టెప్పులు ఇరగదీయడం ఫ్యాన్స్‌కు కనుల పండుగలా అనిపించింది. ముఖ్యంగా 'కుర్చీ మడతపెట్టి' సాంగ్ అన్ని మ్యూజిక్ ఫ్లాట్ ఫార్మ్ ని బ్లాస్ట్ చేసింది. "దేవర" పార్ట్-1 సినిమా కోసం అనిరుధ్ కంపోజ్ చేసిన పాటలు ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాయి. 'ఫియర్ సాంగ్', 'చుట్టమల్లే', 'ఆయుధ పూజ', 'దావుడి'.. ఇలా నాలుగు పాటలూ వేటికవే ప్రత్యేకంగా నిలిచాయి. వాటిల్లో రెండు సాంగ్స్ లో ఎన్టీఆర్ డ్యాన్సులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. 'చుట్టమల్లే' సాంగ్ మెలోడీ ఆఫ్ ది ఇయర్ అనిపించుకుంది. ఇక దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చిన "పుష్ప 2: ది రూల్" సినిమా నుంచి పాటలు కాస్త ఆలస్యంగా వచ్చినా, జనాల్లోకి తొందరగానే వెళ్లాయి. ముందుగా 'పుష్ప పుష్ప' సాంగ్ బాగా వైరల్ అయింది. ఆ తర్వాత వచ్చిన 'సూసేకి' లిరికల్ వీడియో కొన్నాళ్ళు ట్రెండింగ్‌లో ఉంది. 'కిస్సిక్', 'పీలింగ్స్' సినిమాలు విడుదలైన తర్వాత పెద్ద హిట్టయ్యాయి. అలానే 'హను-మాన్' మూవీలోని 'పూలమ్మే పిల్ల' పాట బాగా పాపులర్ అయింది. 'అంబాజీ పేట మ్యారేజ్‌బ్యాండ్' నుంచి వచ్చిన 'గుమ్మా' పాటలు మ్యూజికల్ ట్రీట్ ఇచ్చాయి. 'టిల్లు స్క్వేర్' మ్యూజిక్ ఆల్బమ్ మొత్తం సూపర్ హిట్ అయింది. 'టికెట్టే కొనకుండా', 'రాధిక', 'డీజే టిల్లు రీవ్యాప్' పాటలు యూత్‌కి బాగా ఎక్కాయి. ఎక్కడ డీజే ప్లే చేసినా డీజే టిల్లు పాటలు ఉండాల్సిందే అనే రేంజ్‌లో ట్రెండ్ అయ్యాయి. 'మిస్టర్ బచ్చన్' మూవీ డిజాస్టర్ గా మారినప్పటికీ, పాటలు మాత్రం మంచి హిట్టయ్యాయి. వాటిల్లో 'నల్లంచు తెల్లచీర' సాంగ్ ఇన్స్టంట్ చార్ట్ బస్టర్ అయింది.

యువన్ శంకర్ రాజా చాలా కాలం తర్వాత తెలుగులో వర్క్ చేసిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలోని 'సుట్టంలా సూసి' సాంగ్ జనాలకి ఒక రేంజ్‌లో నచ్చేసింది. 'ఊరు పేరు భైరవ కోన' మూవీలోని 'నిజమేనే చెబుతున్నా' గీతం బాగా ఫేమస్ అయింది. వచ్చే ఏడాది రిలీజ్ అయ్యే సినిమాల్లోని కొన్ని పాటలు కూడా ఈ ఏడాది జనాల్లోకి దూసుకెళ్లాయి. 'తండేల్' నుంచి వచ్చిన మెలోడియస్ 'బుజ్జితల్లి' పాటకు సంగీత ప్రియులు ఫిదా అయ్యారు. ఇప్పుడు ఇన్స్టాగ్రామ్ రీల్స్, వాట్సాప్ స్టేటస్‌లలో ఎక్కడ చూసినా ఈ పాటే కనిపిస్తోంది. ఇలా పైన చెప్పుకున్న పాటలు జియో సావన్, స్పాటిఫై, గానా, అమెజాన్ మ్యూజిక్, రేడియో ఛానల్స్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ఫ్లాట్ ఫార్మ్‌లో వైరల్ అయ్యాయి. ప్రేక్షకులను విపరీతంగా అలరించాయి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



విదేశీ వస్తువుల బహిష్కరణ.. స్వదేశీ వస్తువుల వాడకమనే నినాదం ఊపందుకుని ఉద్యమిస్తున్న వేళ అది. గాంధీ ఆశీస్సులు, రవీంద్రుడు చేసిన నామకరణంతో దేశంలో మొట్టమొదట చేతిరాతతో అక్షరానికి ప్రాణం పోసిన సిరా సులేఖ. నానిగోపాల్, శంకరాచార్య మైత్ర అనే ఇద్దరు కోల్‌కత్తాకు చెందిన వ్యక్తులు ప్రారంభించిన ఆ సిరానే ఆ తర్వాతి కాలంలో మనం వాడిన క్యామ్లిన్ వంటి సిరాల తయారీకి ఓ ఇన్స్పిరేషన్.


# నాటి స్వదేశీ ఉద్యమ చరిత్రకు అక్షర రేఖ.. సులేఖ!

బెంగాల్ విభజనానంతరం ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో భాగంగానే టాటా స్టీల్సైనా, ఓ ఆసియన్ పెయింట్స్ వంటి కంపెనీలైనా పుట్టుకురావడానికి ప్రధాన కారణం. అలాంటివాటిల్లో సులేఖ సిరా కంపెనీ ఒకటి. ఇవన్నీ కూడా నాటి విదేశీ వస్తువుల బహిష్కరణకు స్వదేశీ ఉత్పత్తులుగా ఉద్యమంలో భాగమయ్యాయి. 1930లో స్వదేశీ ఉద్యమం పీక్ స్థాయిలో ఉన్న సమయంలో పిటీషన్స్, లేఖలు రాయడానికి విదేశీ ఇంకునే వాడుతున్న క్రమంలో ఆ విషయాన్ని బెంగాల్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు సతీష్ చంద్రదాస్ గుప్తతో మహాత్మగాంధీ చర్చించారట. స్వదేశీ ఇంక్ ఉంటే బాగుండేదని తన అభిప్రాయాన్ని సతీష్ చంద్ర ముందుంచాడు గాంధీ. ఎందుకంటే, సతీష్ చంద్ర దాస్ అప్పటికే మొట్టమొదటి భారతదేశ సిరాను.. కృష్ణధార పేరుతో తయారుచేశారు. గాంధీ అభిప్రాయం నచ్చిన సతీష్ చంద్ర.. ఆ ఫార్ములాను నానిగోపాల్, శంకరాచార్య మైత్రలకు చెప్పడంతో సులేఖ సిరా ఉత్పత్తికి అంకురార్పణ జరిగింది.

అప్పటికే పలుమార్లు జైలుపాలైన జాతీయవాదులైన నానిగోపాల్, శంకరాచార్య మైత్ర గాంధీ ఆశీస్సులతో స్వదేశీ ఇంక్ ను ప్రమోట్ చేసే పనిలో పడ్డారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ రాజ్షాహి యూనివర్సిటీలో ప్రొఫెసర్ పదవిని కూడా వదులుకుని గాంధీ ఆశీస్సులతో నానిగోపాల్ సిరా అమ్మకాలు మొదలుపెట్టాడు. ఆ సిరా అమ్మకాలు ఇంతింతై.. ఒకదశలో సులేఖ సిరా అనేది ప్రొఫెసర్ మైత్రా సిరాగా పేరు పడిపోయింది.

సు అంటే మంచి.. లేఖ అంటే ఉత్తరం అనే అర్థం వచ్చేలా రవీంద్రనాథ్ ఠాగూర్ పెట్టిన పేరుతో సులేఖ అనే ఈ స్వదేశీ ఇంక్‌ని మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. గాంధీ నుంచి మొదలుకుంటే మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ వంటివాళ్లతోపాటు లెజెండరీ ఫిల్మ్ మేకర్ సత్యజిత్ రే కూడా సులేఖ సిరాతోనే తమ సినిమా స్క్రిప్టులు రాయడంతో పాటే.. సినిమాల్లోనూ సులేఖ సిరాబుడ్లు కనిపించేవి. దాంతో, సులేఖ ఇంక్ మార్కెట్‌కు ఇక తిరుగులేకుండా పోయింది. అలా 1970–80 మధ్యకాలంలో సులేఖ సిరా ఉత్పత్తులు నెలకు పదిలక్షల చొప్పున భారతీయ మార్కెట్‌లో అమ్ముడుపోయి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అందుకే ఇప్పటికీ బెంగాలీలకు సులేఖ సిరా ఓ నోస్టాల్జియా.

అలా స్వదేశీ వస్తు ఉత్పత్తి పేరిట ఇండియన్ మార్కెట్ లోకి వచ్చి ఒక ఊపులూపి.. మరెన్నో సిరా కంపెనీలకు స్ఫూర్తైన సులేఖ సిరా సంస్థ.. కొన్ని కారణాల వల్ల 1986లో మూతబడింది. తిరిగి 2006లో అదే పేరుతో సోలార్ పవర్ ఉత్పత్తులు, ఇతర హోంకేర్స్ వంటివి సులేఖ సంస్థ మార్కెట్ లోకి తెచ్చినప్పటికీ ఆ పునర్వైభవాన్ని మాత్రం ఆ సంస్థ దక్కించుకోలేకపోయింది. నాల్గేళ్ల క్రితం 2020 నవంబర్ మాసంలో మళ్లీ సులేఖ సిరా ఉత్పత్తిని తిరిగి ప్రారంభించింది. స్కార్లెట్, రెడ్, ఎగ్జిక్యూటివ్ బ్లాక్‌తో పాటు రాయల్ బ్లూ వంటి కలర్స్‌లో తిరిగి తన గత స్వదేశీ బ్రాండ్ ఇమేజ్‌తో రంగంలోకి దిగింది. శాంతినికేతన్ లో తయారైన ఖాదీ సంచుల్లో పెట్టి.. దానికి జాతీయవాదపు సెంటిమెంట్ ను కూడా రంగరించుకుని.. ఇప్పుడు మార్కెట్‌లో మళ్లీ డిమాండ్ తిరిగి పొందింది సులేఖ సిరా. యూకే, ఆస్ట్రేలియా, గ్రీస్, యూఎస్ఏ, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్స్ మొదలయ్యాయి. ఒక ఫేస్‌బుక్‌లోనే ఇప్పుడేకంగా సుమారు 2 వేల మంది అభిమానులు సులేఖ ఇంక్‌తో తమకున్న అనుబంధాన్ని షేర్ చేసుకోవడంతో మరోసారి మార్కెట్‌లో మార్మోగుతోంది ఈ సులేఖ సిరా పేరు.



AS THOU BLESSETH!

Some thirty five years ago, Mahatma Gandhi expressed his wish to have a really good Swadeshi Ink, to his disciple Sri Satish Dasgupta. Satish Babu entrusted the work to the two young brothers, just out of jail they had to undergo for participating in the freedom movement. With no capital and resources other than utter sincerity and devotion, the Maitra Brothers undertook the mission that produced Sulekha, now a world famous Fountain Pen Ink.

The fame and sale that Sulekha enjoys to-day were not built in a day. Years of trials and tribulations, continued research, co-operation of the workers and the appreciation of the countrymen stand behind this glorious success. In this Centenary year of the Father of the nation, we bow our head to him with deepest reverence.

SULEKHA WORKS LTD.: SULEKHA PARK, CALCUTTA-32

Progressive/SW-49

నానిగోపాల్ మనవడైన కౌశిక్ ఎండీగా ఇప్పుడు మార్కెట్‌లోకి వచ్చిన సులేఖ సిరాకు చాలా పాఠశాలల నుంచి కూడా డిమాండ్ వెల్లువెత్తుతోంది. నానిగోపాల్, శంకరాచార్య మైత్ర అనే సోదరుల తల్లిదండ్రులు కూడా స్వాతంత్ర్య సమరయోధులు కావడంతో పాటు.. సులేఖ ఇంక్ ప్రారంభపు రోజుల్లో వీరిద్దరి కుటుంబాలు కూడా డోర్ టూ డోర్ ప్రచారం చేసి సులేఖ సిరాను ప్రమోట్ చేశాయి. ఒక చిన్న ఇరుకైన గదిలో ప్రారంభమైన సులేఖ సిరా కంపెనీ కథ.. 1946లో వెయ్యిమంది షేర్ హోల్డర్స్‌తో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా అవతరించింది. అలా ఇంతింతై విస్తరించి ఆఫ్రికాలోనూ రెండు కంపెనీలు పెట్టాలని సులేఖ యాజమాన్యాన్ని ఏకంగా ఐక్యరాజ్య సమితే కోరేస్థాయిలో ఈ సిరా ప్రస్థానం సాగిందంటే సులేఖ సిరా కథ కచ్చితంగా ఓ చరిత్రే!

సులేఖ సిరా అడ్వర్టైజ్ మెంట్ రంగంలోనూ వినూత్న పద్ధతులను పాటించింది. నాడు పశ్చిమబెంగాల్‌లో తిరిగే బస్సులపై కూడా సులేఖ యాడ్స్ కనిపించేవి. వ్యాసుడు చెబుతుంటే విఘ్నేశ్వరుడు మహాభారతాన్ని రాస్తున్నట్టువంటి ఘట్టాలనూ తమ సిరా ప్రమోషన్‌లో వాడుకునీ.. భారతీయ సంప్రదాయవాదులకు దగ్గరైంది ఈ ఇంక్. ఇప్పటికీ పర్యావరణపరమైన అంశాలనూ, స్వాతంత్ర్య సమరయోధులనూ, ఆధునిక సాహిత్యకారులను, మదర్ థెరీస్సా వంటి సేవకులను సింబాలిక్‌గా తమ సిరా ప్రమోషన్‌తో ముడిపెడుతూ.. తన ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ మళ్లీ మార్కెట్ లో సులేఖ నిలబడటం విశేషం.

ఇప్పుడున్న మాడ్రన్ ఈరాలో డిజిటలైజేషన్ పుణ్యమా అని పెన్ను పెట్టి రాసేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఈమెయిల్స్, ఈనోట్స్, ల్యాప్టాప్స్‌తో పాటు.. మొబైల్ ఫోన్లలోనూ టైపింగ్ ఆప్షన్స్ వచ్చాక చేతితో రాసే అక్షర భవిష్యత్తిక అంధకారమే. అదే జరిగినా కూడా సులేఖది ఫౌంటెయిన్ పెన్నులో సిరా పోసి రాసిన ఓ చరిత్రగా ఎప్పటికీ మిగిలిపోయే కథ!

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..

## కరెంటు చార్జీల పెంపును వ్యతిరేకించండి

(సత్యంన్యూస్, పాతపట్నం)



కరెంటు చార్జీలు పెంచబోనని హామీలిచ్చి అవసరమైతే చార్జీలు తగ్గిస్తానంటూ బూటకపు హామీలు గుప్పించి, వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానంటూ ప్రగల్భాలు పలికి, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు ఆ హామీని తుంగలో తొక్కారని రెడ్డి శాంతి గారు ఎద్దేవా చేశారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలలు తిర్కకుండానే జనంపై చార్జీల పిడుగు వేశారని, అబద్ధపు వాగ్దానాలు చేసి ప్రజలతో ఓట్లేయించుకుని ఇప్పుడు వారిని మోసం చేశారన్నారు. కార్యకర్తలతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లోనూ, పెద్దాపురంలోనూ, వైజాగ్ విజన్ డాక్యుమెంట్ విడుదల సమయంలోనూ ఇదే చెప్పారని గుర్తు చేశారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో రూ.15,485.36కోట్లు ప్రజలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 2000 సంవత్సరంలో ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టిన రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుకు ఉందన్నారు. చార్జీల పెంపును ఉపసంహరించుకొనే వరకు వైకాపా పోరాటం చేస్తుందని, దీనిలో భాగంగా ఈ నెల 27 న పాతపట్నం నియోజకవర్గంలో జరిగే ర్యాలీలో అన్ని వర్గాలవారు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## కిడ్నీ బాధితునికి రక్తదానం

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)


మండలంలోని చౌదరి కొత్తూరు గ్రామానికి చెందిన ముడిదాన ఆనందరావు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం సాయింత్రం టెక్కలి జిల్లా హాస్పిటల్‌లో డయాలసిస్ చేసే ముందు ఓ పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని వైద్యులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. రక్తదానం చేసేవారు లేక టెక్కలి అభయం యువజన సేవా సంఘం వారిని కలవగా వెంటనే స్పందించిన అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు టెక్కలి బ్లడ్‌బ్యాంక్ ద్వారా బాధితుని భార్యకు ఓ ఓ-పాజిటివ్ బ్లడ్ అందించారు.



## శ్రీనివాసరావు సేవలు స్ఫూర్తిదాయకం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంఘంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ అండగా నిలుస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రముఖ విద్యావేత్త, శ్రీ సాయి విద్యాసంస్థల అధినేత బూరగాపు లక్ష్మణరావు మాస్టారు కొనియాడారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల ఆధ్వర్యంలో సూర శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాస్టారు మాట్లాడుతూ సూర శ్రీనివాసరావు నిస్వలాపేక్ష సేవలు గుర్తించి. మున్ముందు కూడా ఇలాంటి సేవాకార్యక్రమాలు చేస్తూ మరిన్ని పేరు ప్రఖ్యాతులు పొందాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో ప్రయివేటు పాఠశాలల సిబ్బందికి నిత్యావసర సరుకుల పంపిణీ చేసి ఒక భరోసా కల్పించారన్నారు. ఈ కార్రృమంలో సుమారు 100 మంది స్కూల్ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.





## టెక్కలిలో కారు ఢీకొని ఒకరికి గాయం

(సత్యంన్యూస్, టెక్కలి)

టెక్కలి మండలం స్థానిక జగతిమెట్ట సమీప సర్వీస్ రోడ్‌లో గురువారం ఉదయం కారు అదుపుతప్పి సైకిల్‌పై వెళ్తున్న తాపీ మేస్త్రి హనుమంతు సింహాచలంను ఢీకొనడంతో తలకు బలమైన గాయం అయ్యింది. కారు నడుపుతున్న డ్రైవర్‌కు ఫిట్స్ రావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలియజేస్తున్నారు. గాయపడ్డ పేషెంట్‌ని, ఫిట్స్ వచ్చిన డ్రైవర్‌ని హైవే అంబులెన్స్ సిబ్బంది టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా డ్యూటీ వైద్యులు ఫణికుమార్ వైద్యం అందించారు

## నిరాశ్రయుల భవనంలో అల్పాహార వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

క్రిస్టమస్ పండగను పురస్కరించుకొని స్థానిక గొంటివీధిలోగల పట్టణ నిరాశ్రయుల భవనం నైట్‌షెల్టర్‌లో కొంక్యాన గోవిందదాజులు ట్రస్ట్ అల్పాహార వితరణ చేపట్టారు. ఇందులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అల్పాహార వితరణ చేపట్టినంతరం మాట్లాడుతూ తన సోదరి దివంగత కొంక్యాన రాజేశ్వరి జ్ఞాపకార్థం క్రిస్టమస్ పండుగ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇక్కడ ఎన్నో సేవాకార్యక్రమాలను తమ ట్రస్ట్ ద్వారా జరిగాయని, జరుగుతాయని, వీరికి అండగా నిలుస్తామన్నారు. ఈ పరిధిలో ఉన్న నీళ్ల ట్యాంకర్ నిండి నీళ్లన్నీ వృధాగా పారుతూ ఇక్కడ ఉండేవారికి ఇబ్బందికరంగా మారుతూ అనారోగ్యం పాలవుతున్నారని, పైప్‌లు విరిగి నీటి సదుపాయం కూడా సరిగా లేదని, వీరికి తినటానికి కూడా ఏమి ఉండదని, ఆర్థిక స్తోమత లేని కారణంగా వెచ్చించి తినే పరిస్థితి లేదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు నిధులు కేటాయించి వీరిని ఆదుకోవాలన్నారు. వీరి ఆరోగ్య బాగోగుల కోసం ఒక వైద్య శిబిరాన్ని నిర్వహించి, మందులను అందజేస్తామన్నారు. ఇక్కడ ఉండే నిస్సహాయ అభాగ్యులకు, వలస కుటుంబాలకు గత నాలుగు సంవత్సరాల నుండి అండగా నిలుస్తున్న ఉర్లం శివతేజ సేవలను గుర్తించి




మెప్మా ఆధ్వర్యంలో నడుస్తున్న పట్టణ నిరాశ్రయుల భవనం ఈ నైట్‌షెల్టర్ బాధ్యతలను అప్పగించే విధంగా మున్సిపల్, మెప్మా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం ఉర్లం. శివతేజ సేవలు కొనసాగాలని, ఉర్లం. శివతేజ, సహకరిస్తున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ కుటుంబ సభ్యులు, సరోజ కొంక్యాన శివ శంకర్, నిత్య సేవకులు ఉర్లం శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి పొడుగు చరణ్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయి కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ మానసిక బలాన్ని మెరుగుపరుస్తుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాక్సింగ్ డే సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ బాక్సింగ్ కోచ్ ఎం.ఉమామహేశ్వరరావును నడక సంఘాల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి. ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడు, గుడ్ల జగ్గారావులు మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడకు శ్రీకాకుళం జిల్లాలో ఒక గుర్తింపు గౌరవం తెచ్చిన మహోన్నత వ్యక్తి మానిక్యాల ఉమా మహేశ్వరరావు అని కొనియాడారు. ఎందరో విద్యార్థులను జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారుచేసిన ఘనత ఉమామహేశ్వరరావుకు దక్కుతుందన్నారు. బాక్సింగ్ తరతరాల క్రీడ అని, శారీరక పరాక్రమాన్ని కాకుండా మానసిక బలాన్ని కూడా మెరుగుపరుస్తుందన్నారు. మానసిక ఒత్తిడి లేకుండా చేసే క్రీడ బాక్సింగ్ మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా పిఠాపురంలో ఈనెల 18,19,20 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగిన సీనియర్ మెన్ బాక్సింగ్ టోర్నమెంట్ విజేతలై పతకాలు సాధించిన సి.హెచ్.జ్ఞానేశ్వరరావు (గోల్డ్), పి.అప్పలరాజు (గోల్డ్), పి. విశ్వేశ్వరరావు (సిల్వర్), ఎం.లోకేష్ (సిల్వర్), ఎస్. ఏసు (సిల్వర్), కె.శ్రీకాంత్ (సిల్వర్), డి.మనోజ్ కుమార్ (సిల్వర్), ఆర్.హేమంత్‌కుమార్ (గోల్డ్)లను అభినందించారు. అదే విధంగా వీరిలో పి.అప్పలరాజు, సీహెచ్ జ్ఞానేశ్వరరావు, ఆర్.హేమంత్‌కుమార్‌లు వచ్చేనెల 6నుండి 12వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపిక కావడంతో వారిని ప్రత్యేకంగా అభినందించారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## భీమేశ్వర భజన బృందం ధనుర్మాస మేలుకొలుపులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొన్నవీధి భీమేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో ధనుర్మాస మేలుకొలుపులు జరుగుతున్నాయి. ఇప్పటికి 26 సంవత్సరాలుగా నిరంతరాయంగా ధనుర్మాసంలో మేలుకొలుపులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బృందం ప్రతినిధులు బలగ మన్మధరావు, సొంగలి గణేష్ తెలిపారు. పలు భజన బృందాల సభ్యులు కూడా కార్యక్రమంలో భాగస్వాములవుతూ తమకు సహకరిస్తున్నారని వారు చెప్పారు. వాతావరణం అనుకూలించనప్పటికీ తమ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగుతోందన్నారు. సంక్రాంతి రోజున 24 గంటల పాటు భజన కార్యక్రమం (ఏకాహం) ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జరుగుతుందన్నారు. ఇందుకు సహకరిస్తున్న అన్ని భజన బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. ధనుర్మాస మేలుకొలుపుల అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. మేలుకొలుపు భజనల్లో నిర్వాహకులు బలగ మన్మధరావు, సొంగలి గణేష్‌తో పాటు గార సూర్యనారాయణ, ఈశ్వరరావు, డోలక్‌పై మల్లేశ్వరరావు, సూర్యనారాయణ, శ్యామ్, రాజు, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొంటున్నారు. వీరితో పాటు అలిగి దినేష్ పాల్గొన్నారు.

## 28న శనీశ్వరునికి తైలాభిషేకాలు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

అమ్మా సంస్థాన్ ప్రాంగణంలోని శనీశ్వరునికి ఈ నెల 28న తైలాభిషేకాలు అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ, నవీన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు సంస్థాన్ వ్యవస్థాపక అధ్యక్షులు సాగి శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 28న శనివారం శనిత్రయోదశి సందర్భంగా ఉదయం 4.30 గంటల నుంచి శనిగ్రహ ప్రీత్యర్థం తైలాభిషేకాలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా కర్కాటక రాశి (అష్టమ శని), వృశ్చికరాశి (అర్ధాష్టమ శని), మకరరాశి (ఏలినాటిశని), కుంభరాశి (జన్మశని), మీనరాశి (ఏలినాటిశని) వారు తప్పకుండా ఈ అభిషేకం చేయించుకోవాలన్నారు. అభిషేకంలో పాల్గొనే భక్తులు ఆలయంలో సంప్రదించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ఏపీపీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఏపీపీటీఏ) శ్రీకాకుళం జిల్లా సర్వసభ్య సమావేశం నలంద స్కూల్ గూనపాలెంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.మాధవరావు అధ్యక్షతన గురువారం జరిగింది. జిల్లా కార్యవర్గ ఎన్నికల అధికారిగా టి.శివరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షురాలుగా ఎస్‌విఎస్ఎల్ పూర్ణిమ, సెక్రటరీగా కె.జగన్ మోహన్ రావు, ట్రెజరర్‌గా కె.మాధవరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షురాలు ఎస్‌విఎస్ఎల్ పూర్ణిమ మాట్లాడుతూ జీవో 107 రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంపై హర్షంతెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల కావస్తున్నా ఉద్యోగుల బకాయి చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతోందని, వెంటనే దీనిపై దృష్టి సారించాలని సంఘం కోరింది. ఈ కార్యక్రమంలో ఎస్.గోవిందరాజులు, ఎ.రామారావు డి.పార్వతీశం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## కేకే నాయుడుపేటలో వైద్య శిబిరం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

కేకే నాయుడుపేటలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వర్షాలు, తుపాను కారణంగా గ్రామస్తులు వ్యాధుల బారిన పడటంతో గ్రామస్తులు బోర విజయ్ కుమార్, అసిరప్పుడు ఆధ్వర్యంలో ఈ శిబిరానికి ఏర్పాట్లు నిర్వహించారు. కేకే నాయుడుపేట, కొయ్యాం, పీకే నాయుడుపేట, గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. కేకే నాయుడుపేట అంగన్వాడీ కార్యకర్త బలివాడ విజయలక్ష్మి గ్రామస్తులను ప్రోత్సహించి వైద్య శిబిరానికి వచ్చేలా చూశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామారావు, అయ్యప్ప రెడ్డి, ప్రస్తుత సర్పంచ్ వెంకటమ్మ, జీరు అప్పలస్వామి, జెమ్స్ డిప్యూటీ మేనేజర్ ఎస్.శివప్రసాద్, క్యాంపు కోఆర్డినేటర్ వి.లక్ష్మణరావు, వైద్యులు బి.గీతాప్రియ, పి.శివమణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పందాలు అమలుచేయకపోతే పోరాటాలు ఉధృతం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ కార్మికుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలుచేయాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిటు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కడం అన్యాయమని విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, అరుగుల రాము, ఎ.మోహన్, ఎన్.పార్వతి, గిరిజాశంకర్, సోమేష్ మణికంఠ, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

## 29న రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమం ఈ నెల 29న (ఆదివారం) నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం రెడ్డి సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. సభ్యులందరూ ఎన్ని పనులున్నా సమయాన్ని కేటాయించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరింది. దశాబ్దాల రెడ్డి సామాజికవర్గ కల అయిన రెడ్డి సంక్షేమ భవనం నిర్మాణానికి కేటాయించిన ఎకరా 62 సెంట్ల భూమిలో ముందుగా ప్రహరీ గోడ కట్టడానికి సభ్యులందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంపౌండ్‌వాల్, వెల్ఫేర్ బిల్డింగ్ నిర్మించడానికి నిధులు సమకూర్చడం, సభ్యుల సలహాలు, సూచనలు స్వీకరించడం, ప్రాంతాలవారీగా కమిటీల ఏర్పాటుకు ఈ నెల 29న జిల్లా జైలు పక్కన రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించిన స్థలంలో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో లక్షల మంది జనాభా గల అతి పెద్ద సామాజికవర్గం అయిన రెడ్డిలు ప్రతిఒక్కరు నేను సైతం అనే స్ఫూర్తితో అడుగులో అడుగు వేసి రెడ్డి వెల్ఫేర్ బిల్డింగ్ నిర్మాణానికి, ప్రహరీ గోడ వీలైనంత త్వరగా నిర్మించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాబోయే తరానికి, చరిత్రలో గుర్తుండిపోయే రెడ్డి సామాజిక భవనం నిర్మాణం మన చేతుల్లోనే ఉందని పేర్కొంటూ జిల్లాలో ఉన్న రెడ్డి కుటుంబ సభ్యులందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

## స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అవకాశం ఇవ్వండి

(సత్యంన్యూస్, సోంపేట)

సోంపేట పంచాయతీ జలంత్ర సోంపేటకు చెందిన పట్టుశాలి, జాలరి, పోస్ట్ ఆఫీసు, సూర్యవాస వీధులతో పాటు మహాదేవిపేటలో స్థిరాస్తుల క్రయవిక్రయాలకు అవకాశం కల్పించాలని తహసీల్దారుకు బాధితులు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి దఖలుపడి వారసత్వంగా వచ్చిన గృహాల్లో సుమారు 50 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, పూర్వీకుల నుంచి పంచాయతీకి ఇంటిపన్ను చెల్లిస్తున్నామని రశీదులు చూపించారు. జలంత్ర సోంపేట అంతా సోంపేట గ్రామ కంఠంలో ఉన్నట్టు చూపించి స్థిరాస్తుల క్రయవిక్రయాలు చెల్లుబాటు కావని సోంపేట సబ్‌రిజిస్ట్రార్ ప్రకటించారని తహసీల్దారు దృష్టికి తీసుకువెళ్లారు. ఏడాది క్రితం వరకు స్థిరాస్తుల క్రయవిక్రయాలు చెల్లుబాటు జరిగిన నివాస ప్రాంతాలు గ్రామకంఠానికి చెందినట్టు చూపించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జలంత్ర సోంపేట పరిధిలో ఉన్న వీధులను, మహదేవిపేట ప్రాంతాన్ని సర్వే చేయించి, స్థిరాస్తుల సర్వే నెంబర్లు తెలియజేయాలని తహసీల్దారును కోరారు. స్థిరాస్తులను క్రయవిక్రయాలు జరిపేందుకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దారును కలిసినవారిలో ఎన్.వెంకటరావు, వి.బద్రినారాయణ, యు.మహేశ్వరరావు, బి.వెంకటరావు, బి.వాసు, లోలాక్షి, లక్ష్మి, ఢిల్లీ, రాజారావు తదితరులు ఉన్నారు.



## కొబ్బరిచిప్పలతో నానోకార్బన్ బ్యాటరీలు

ఇండియాలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీస్) మార్కెట్ ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. దీనికి ప్రధాన కారణం పెరుగుతున్న ఇంధన ధరలు, పర్యావరణ అవగాహన అయితే, ఎలక్ట్రిక్ వాహనాలకు బ్యాటరీలే ఆధారం. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు వస్తే, మరీ ఆ బ్యాటరీల కోసం ఖనిజాలను తవ్వడం పెరిగిపోతుంది. దీనివల్ల వనరులపై మరింత భారం పడుతుంది. దీనికి పరిష్కారం ఏంటి..? ఈ ప్రశ్నకు సమాధానమే జైపూర్‌లోని 'క్యాన్రిక్' స్టార్టప్.

క్యాన్రిక్ కో-ఫౌండర్స్ అయిన అక్షయ్ జైన్, మహీసింగ్ బ్యాటరీల కోసం కొబ్బరిచిప్పలతో నానోకార్బన్‌ను తయారు చేసి వేస్ట్ నుంచి వెల్త్‌ను సృష్టిస్తున్నారు. ఈ నానోకార్బన్ బ్యాటరీ పనితీరును 125 శాతం పెంచుతుందట. తద్వారా బ్యాటరీ ఉత్పత్తి కోసం ఖనిజాల తవ్వకం తగ్గుతుందని అక్షయ్, మహి అంటున్నారు.

అక్షయ్, మాహి జైపూర్‌లో ఒకే పాఠశాలలో చదువుకున్నారు. 2010లో అక్షయ్ సింగపూర్‌లోని నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్‌లో రసాయన ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేశాడు. రెండు సంవత్సరాల తర్వాత, మాహి కూడా నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీలో మాస్టర్స్ చేయడానికి సింగపూర్ వెళ్లాడు. అదే సమయంలో వీరు ఇద్దరు టెక్నాలజీ గురించి ఆలోచించారు. అప్పుడే వ్యవసాయ వ్యర్థాలను రసాయనాలుగా, తక్కువ ధర ఇంధనంగా మార్చేందుకు





ప్రయత్నించారట. ఏడాదిన్నర పరిశోధన తర్వాత వ్యవసాయ వ్యర్థాలను బ్యాటరీలలో ఉపయోగించే అధిక విలువ కలిగిన నానోకార్బన్‌గా మార్చగలిగారు. 2020లో తమ స్టార్టప్ 'క్యాన్రిక్'ని ప్రారంభించారు.

ప్రారంభంలో వారు 15 వేర్వేరు వ్యర్థాలను ఉపయోగించి వాటిని నానోకార్బన్‌లుగా మార్చేందుకు ప్రయత్నించారు. వాటిలో కొబ్బరి చిప్పలు, కొబ్బరి పీచు, కాగితపు వ్యర్థాలు, జుట్టు వంటివి ఉన్నాయి. నానోకార్బన్‌ను ఉపయోగించి బ్యాటరీలు బీఐఎస్ ప్రమాణాలను అనుసరించి పరిశోధన చేసి, వారు ఇండస్ట్రీలోనూ ఈ ఉత్పత్తిని విక్రయించారు. ఇప్పటి వరకు 3,500 బ్యాటరీలు క్యాన్రిక్ నానోకార్బన్‌తో తయారుచేసి ఢిల్లీ, మహారాష్ట్ర, ముంబై, పూణె మార్కెట్లలోకి విడుదల చేశారు. క్యాన్రిక్ స్టార్టప్‌కు 2023లో 'నేషన్ ఎనర్జీ ఎఫీషియన్సీ ఇన్నోవేషన్' అవార్డును బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ప్రదానం చేసింది.

ఈ నానోకార్బన్‌లు లిథియం అయాన్ హైబ్రిడ్ బ్యాటరీల ఎనర్జీ డెన్సిటిని 125 శాతం పెంచుతాయి. ద్విచక్ర వాహనాలకు ఈ నానోకార్బన్ బ్యాటరీలు వేయడం వల్ల 225 కిలోమీటర్ల వరకూ ప్రయాణించ వచ్చని అక్షయ్ అంటున్నారు. బ్యాటరీలలో 20 శాతం వరకు నానోకార్బన్‌ను ఉపయోగించి, తద్వారా వారంటీ రిటర్న్‌లు తగ్గించామని, భవిష్యత్తులో దీన్ని మా అన్ని బ్యాటరీలలో సమగ్రంగా కలపాలని యోచిస్తున్నాని అక్షయ్ తెలిపారు.

నానోకార్బన్ బ్యాటరీలు సీవో2, జీహెచ్‌జీ ఉద్గారాలను తగ్గిస్తుంది. 2050 నాటికి ఇవి పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి వచ్చినా ప్రతి సంవత్సరం 4 గిగాటన్ సీవో2 ఉద్గారాలను తగ్గించవచ్చు. ప్రతి సంవత్సరం పరిశ్రమల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 41 నుంచి 45 బిలియన్ మెట్రిక్ టన్నుల సీవో2 ఉద్గారాలు ఉత్పన్నమవుతున్నాయి. కార్బన్ డయాక్సైడ్ వల్ల వాతవరణంలో సమస్యలు, హిమాలయాలు కరగిపోవడం, సముద్రం ఆమ్లీకరణ, గాలిలో నాణ్యత దెబ్బతినడం, వ్యవసాయం మీద ప్రభావం, శ్వాసకోశ, హృదయ సంబంధిత సమస్యలు రావడం ఇలా ఎన్నో ఉన్నాయి. సీవో2 ఉద్గారాలను తగ్గించడం ప్రకృతి పరిరక్షణ, జీవరాశుల భవిష్యత్తుకు చాలా అవసరం. క్యాన్రిక్ లాంటి స్టార్టప్ అవసరం మన దేశానికి, మన ప్రపంచానికి చాలా ఉంది. అందులోనూ వ్యర్థాల నుంచి నానోకార్బన్ తయారుచేస్తున్న అక్షయ్, మహి లాంటి యువతను మనం ప్రోత్సహించాలని పర్యావరణ నిపుణులు అంటున్నారు.

- సత్యం ఐటీడెస్క్




## ఘనంగా కృష్ణచైతన్య బర్త్‌డే వేడుకలు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

మబగాం గ్రామంలో యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ధర్మాన రాందాస్, ధర్మాన పద్మ ప్రియ, ధర్మాన సత్యవతమ్మ, ఎంపీపీలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగినాయుడు, వాన గోపి, జడ్పీటీసీ చింతు రామారావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, ధర్మాన జగన్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నరసన్నపేట పార్టీ కార్యాలయంలో యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంపీపీలు ఆరంగి మురళీధర్, జడ్పీటీసీ చింతు రామారావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు డైరెక్టర్లు, ఎంపీటీసీలు సర్పంచులు, పట్టణ వార్డు సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో కూడా కృష్ణచైతన్య బర్త్‌డే వేడుకలు జరిపారు.



## 'గోకులం'లో గుంటనక్కలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయం నుంచి సమాచారం సేకరించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పశుమత్స్యదర్శిని పేరుతో రూ. 4.65కోట్లు రెండేళ్ల కోసం రైతుల నుంచి చందాలు వసూలుచేశారు. దీనికి ప్రభుత్వం కార్పస్ ఫండ్‌గా రూ.15 లక్షలు, పశుమత్స్యదర్శిని మాసపత్రికలో ప్రకటనల కోసం రూ. 16.50 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తం రూ. 4.95 కోట్లలో రూ. 2.87 కోట్లు మాసపత్రిక కోసం ఖర్చు చేసినట్టు చూపించారు. బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్‌గా రూ.1.40కోట్లు చేసి నట్టు పేర్కొన్నారు. సేవింగ్ అకౌంట్‌లో రూ.69.49 లక్షలు మాత్రమే మిగిలి ఉన్నట్టు చూపించారు.

### మూడు నెలల్లోనే ఖాతా ఖాళీ

రైతుల నుంచి వసూలుచేసిన చందాలు, ప్రభుత్వ ప్రకటనలు, కార్పస్ ఫంగ్‌గా పేరుతో విశాఖపట్నం లోని ఐడీబీఐ బ్యాంకులో జమ చేసిన రూ.4.95 కోట్లలో సుమారు రూ.3 కోట్లు ప్రింటర్స్, వివిధ సంస్థల పేర్లతో 3 నెలల్లోనే విత్‌డ్రా చేసి అవినీతికి పాల్పడినట్టు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. అధికారు లంతా పశుమత్స్యదర్శిని మాస పత్రిక పేరుతో వసూలుచేసిన చందాలు మొత్తాన్ని పంచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చందాలు వసూలు చేసిన రెండేళ్ల వరకు అంటే 2021 మే నుంచి చందాలు వసూలుచేయడం ప్రారంభించారు. 2021 జూలై 27న రూ.1.40 కోట్లు ఓపెనింగ్ బ్యాలెన్స్‌తో ఐడీబీఐ బ్యాంకులో విశాఖపట్నం అడిషనల్ డైరెక్టర్ పేరుతో ఒక ఖాతాను తెరిచి లావాదేవీలు నిర్వహించారు. ప్రస్తుతం ఈ ఖాతాలో కేవలం రూ.69 లక్షలు మాత్రమే మిగిలింది. రెండేళ్ల కోసం రూ.500 చొప్పున బలవంతపు చందాలు వసూలు చేసినా పశుమత్స్యదర్శిని మాసపత్రిక మాత్రం చందాదారులకు అందడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ కుంభ కోణంలోనూ శాఖ ఉన్నతాధికారుల పాత్ర ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపైనా ఏసీబీ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి దుర్వినియోగం అయిన నిధులను బాధ్యులైన పశుసంవర్ధక శాఖ అధికారుల నుంచి రికవరీ చేయాలని బాధితులు కోరుతున్నారు.

## ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు




(సత్యంన్యూస్, రాజాం)

సీపీఐ శతవార్షికోత్సవాల్లో భాగంగా రాజాం నియోజకవర్గ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజాం మార్కెట్ రోడ్డులో అరుణ పతాకాన్ని సీపీఐ పార్టీ రాజాం నియోజవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సాధనలో సీపీఐ అగ్రగామిగా నిలిచిందని, దున్నేవానికి భూమి దక్కాలంటూ ఉద్యమం చేసిందని, భూ సంస్కరణల చట్టం కోసం పోరాడి లక్షలాది ఎకరాలు భూ పంపిణీ చేసిందని అన్నారు. భారత గడ్డపై ఎర్ర జెండాకు వందేళ్ల చరిత్ర ఉందని, ప్రజా పోరాటాల కోసం సీపీఐ దశల వారీ ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి సింగారపు కనకరాజు, గంగరాజు, జామి అప్పారావు, యండమూరి కృష్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.